# ఉత్సవమూర్తి

"విష్ణుపద్మ కపింజల సంహితోక్త ప్రకారేణ.... దివ్య నీరాజనం సమర్పయామి, శ్రీమద్రమారమణ గోవిందో హరి"

గత ఐదారు తరాలుగా కేశవాచార్యులుగారి కుటుంబం వారే అంజనేయస్వామి గుడి అర్చకులు. కేశవాచార్యులు గారు తన పద్నాలుగవ ఏట నుంచీ అర్చకత్వం చేస్తున్నాడు.

"ఆలయం ఆయనది; దేవుడు ఆయనకి పలుకుతాడు, మనం దేవుణ్ణి మొక్కితే, దేవుడు మనకి వరం యిస్తే, ఆ వరాన్ని మనకి అందించే వారధి అయన" అన్నది ఆ ఊళ్ళో అనేకమంది అభిప్రాయం.

ఆ వారధి బలహీనమైతే దేవుడి నుంచి భక్తుడికి వరాలు చేరే విధానం క్లిష్టమైపోవచ్చు. దానితో ప్రజలలో దైవభక్తి తగ్గిపోవచ్చు. దైవభక్తి ఉండకపోతే పాపభీతి ఉండాల్సిన అవసరం లేదు. పాపభీతి, చట్టభీతి లేకపోతే పాపాలు, నేరాలు జరిగే అవకాశాలు ఎక్కువ. ఆ చట్టమే దైవభక్తి నశించే మార్గాలు కల్పిస్తే??

దేవపూజా విధానాన్ని దానికి సంబంధించిన విషయాల్ని చెప్పే శాస్త్రాన్ని "ఆగమశాస్త్రం" అంటారు. అందులో "పాంచరాత్రము" అనే వైష్ణవ సాంప్రదాయపూజా విధానం ఒకటుంది. ఆ పాంచరాత్ర ఆగమంలో కేశవాచార్యులుగారు అఖండ ప్రజ్ఞాశాలి. ఆ ఊరివారందరూ కలిసి ఆయనకు "పాంచరాత్ర ఆగమ వాచస్పతి" అనే బిరుదు ఇచ్చారు.

ఆ సభలో మాట్లాడుతూ శ్రీ సీతారామ యతీంద్రులు చేసిన ప్రసంగం యిది:

“ఆకాశం మూగది కాదు, శబ్దమయం, శబ్దతరంగమయం, తరంగ రూపంలో వున్న శబ్దాన్ని మనం వినలేం. మనకు కావలసిన శబ్దాలను కొన్నిటిని వినాలంటే శక్తివంతమైన రేడియో సెట్ వుంటే వినచ్చు. ఆ శబ్దమే ఎన్ని రేడియో సెట్లుంటే, అన్ని రేడియో పెట్లలోంచి ఒకేవిధంగా, సంపూర్ణంగా వినబడుతుంది. అలాగే సృష్టి అంతా నిండివున్న భగవచ్ఛక్తిని సామాన్య మానవులు గ్రహించలేరు. రేడియో ఇంజనీర్‌లాగా శక్తిమంతుడైన ఉపాసనాపరుడు, దైవాన్ని సాధించి, యంత్రరూపంలో నిక్షేపించి, దేవాలయ మూలవిరాట్ క్రింద ప్రతిష్టిస్తాడు. అప్పుడు విశ్వవ్యాప్తమైన దైవశక్తి ఆ విగ్రహము నందు 'రేడియోలో శబ్ద తరంగముల లాగా ప్రవేశిస్తుంది. గుడికి వెళ్ళే భక్తుల కొన్ని కోరికలను సిద్ధింపజేస్తుంది. ఆ సిద్ధించడం, విగ్రహం క్రింద ఉన్న యంత్రశక్తి మీద, శిల్పి యొక్క ధ్యానం మీద, ప్రతిష్టించిన ఉపాశకుడి సిద్ధిమీద, పరంపరగా వచ్చే అర్చకుల ఉపాసనా బలం మీద, భక్తుల నిరంతర భక్తి మీద ఆధారపడివుంటుంది.

“నీ రేడియో సెట్టు అణాకాని పెట్టయితే అందులో విజయవాడ, హైదరాబాదులే సరిగ్గారావు. అమెరికా, ఆస్ట్రేలియా ఏమేడుస్తాయి? అలాగే ఇన్ని దేవాలయాలుంటే మాచవరం ఆంజనేయస్వామి గొప్పదేవుడు, బెజవాడ కనకదుర్గ భక్తుల కొంగుబంగారం, తిరుపతి వేంకటేశ్వరుడు కలియుగదైవం వంటి ప్రజావాక్యాలు ఎలా బయలుదేరతాయి? అదే యంత్ర బలం, ఉపాసనాబలం అంటే.

రేడియో సర్వీసింగ్ చేయడానికి, అవసరమైతే బాగు చేయడానికి, మంచి “మెకానిక్” ఒకడు కావాలి అది “టెక్నికల్” విషయం. రేడియో స్విచ్ వేయగల ప్రతివాడూ, రేడియోని తయారుచేయలేడు. సర్వీసింగ్ చేయలేడు. అది ఆలోచించకుండా 'ఓస్! ఇదెంతపని' అని విప్పదీశావా, పులిస్తరాకులో చుట్టి కాలవలో పారేయడమే మిగిలేది, సరిగ్గా ఆ మెకానిక్ లాటి వాడు అర్చకుడు. నిత్యపూజావిధులు. విశేష పూజావిధులు, పర్వదినాలు, సంప్రోక్షణలు అనేక పనులు ఉంటాయి అతనికి. రేడియోల్లో చిన్నవి, పెద్దవి, ఒక బ్యాండుని రెండు బ్యాండ్లవి. మూడు బ్యాండ్లవి 'టూ యిన్ వన్”లు “త్రీ యిన్ వన్” లు పాత తయారీవి, అత్యాధునికమైనవి అనేకం వుంటాయి. అందరు

మెకానిక్‌లు అన్ని రేడియోలు బాగు చేయలేరు. అలాగే దేవాలయాల్లోని అర్చకులు గూడా! రామాలయంలోని అర్చకుడు శివాలయం వెళితే రాంభజన చెయ్యడమే! శివాలయంలోని అర్చకుడు రామాలయం వెళితే తాండవం చెయ్యడమే!

"దూరంగా ఉన్నవాడికి అన్ని మంత్రాలు ఒక్కలాగానే వినబడతాయి కాని పాంచరాత్రం వేరు, వైఖానసం వేరు, శైవం వేరు, శాక్తేయం వేరు, గాణాపత్యం వేరు. పాంచరాత్రంలోనే నారాయణ సంహితా క్రమం వేరు, కపింజల సంహితా క్రమం వేరు. కేశవ నారాయణ, మాధవ మొదలైన ఇరవైనాల్గు నామాల్ని బట్టి ఇరవై నాల్గు పూజా విధానాలున్నాయి. ఏ ఆలయంలో ఏ పూజావిధానం నడుస్తోందో, అక్కడ పరంపరగా వస్తున్న అర్చకుడికే తెలుస్తుంది. కాబట్టి పేరు తెలిస్తే చాలదు. ఆ పూజాక్రమం అంతా తెలియాలి. అప్పుడే ఆ రేడియో పలుకుతుంది. ఆ దేవుడు వరం యిస్తాడు. ఇదే "దేవుడు వరం యిచ్చినా పూజారి యివ్వలేకపోవడమంటే"! ఆ విధంగా పాంచరాత్ర ఆగమశాస్త్రం మొత్తంలో సాంప్రదాయ శుద్ధిగా కేశవాచార్యులుగారికి తెలియని విషయం లేదు. ఆయన కివ్వాళ మీరంతా కలిసి "పాంచరాత్ర ఆగమ వాచస్పతి" అనే బిరుదు యివ్వడం ఎంతైనా సముచితం".

కరతాళధ్వనులు మిన్ను ముట్టాయి. ఉలిక్కిపడి లేచాడు కేశవాచార్యులుగారు. ఏనాటి సభ! ఏనాటి చప్పట్లు? ఆ ప్రజలు వేఱు, ఆ సంస్కారాలు వేరు. ఇప్పుడేవో కొత్త ప్రభుత్వాలు వస్తున్నాయి. వీళ్ళకేమీ పూర్వాపరజ్ఞానాలు ఉన్నట్టు లేవు.

దబాయించి మంత్రాలు చదువుతున్నాడని ప్రొద్దున్న ఓ కుర్రవాణ్ణి పంపించాడు మంత్రిగారు. తన తరువాత వాడు అర్చకుడట. తన కొడుకు పనికిరాడట! పేరుకు మంత్రేగాని మంత్రాల గురించి పాపం ఆయనకేం తెలుసు? మొదట ఆ కుర్రవాణ్ణి చూసి వాడి కోటూ, బూటూ, హేటూ, నల్లకళ్ళద్దాలు, ఎవడో ఫ్రెంచిదొర అనుకున్నాను. కాదు. మనవాడే! ఆ వేషం విప్పి పంచె, జంధ్యం, పిలక టోపీ పెట్టి పూజారి వేషం వేశాడు. "అదేమిటయ్యా" అంటే "ఇది నా డ్యూటీ" అని శివాష్టోత్తరం చదవడం మొదలుపెట్టాడు. "నాయనా! ఇది ఆంజనేయస్వామి కోవెల! ఇక్కడ ఆంజనేయాష్టోత్తరాలు చదవాలోయ్" అంటే "నాకిదే వచ్చునండి. ఇలా ట్రాన్స్‌ఫర్ అయిన ప్రతి గుళ్ళో క్రొత్తగా



అష్టోత్తరాలు నేర్చుకోవాలంటే నా పని అయినట్టే" అన్నాడు. ఈ ముప్పై అయిదు మార్కుల వాడికి నేను కపింజల సంహిత చెప్పేదేమిటి నాబొంద!! "సరేలే! శివుడైతేనేమి? ఆంజనేయుడైతేనేమి? అల్లా అయితేనేమి? ఇల్లా అయితేనేమి? అందరు దేవుళ్ళూ

ఒకటేగా" అన్నాను. వాడొక వికటాట్టహాసం చేసి "అల్లా కాదు, ఇల్లా కాదు, రాయి దేవుడేమిటి? నీ బొంద, నా బొంద!" అన్నాడు. వీడి దుంప తెగ!! ఏ మతస్థుడైతేనేమి, దేవుడనే వాడున్నాడనుకుంటే అదే చాలనుకున్నాను. వీడు పచ్చి నాస్తికుడు. అది ఎలా నిరూపించడం? ఉద్యోగం కోసం నాలుగు అష్టోత్తరాలు, కాస్త మంత్ర పుష్పం నేర్చుకున్నాడు. అదే వాడి క్వాలిఫికేషన్. అంతకన్నా వీడికింకేమీ రాదు. వీడినిక్కడ పెట్టిన వాళ్ళకి అది కూడా రాదాయె! నాలుగు ఇనుపముక్కల్ని జాగ్రత్తగా కలపగలిగిన వాడుంటే, అది రేడియో అయి, స్విచ్ వేస్తే శబ్దం వినబడుతోంది కదా? ఉపాసన చేసి, యంత్ర స్థాపన చేసి, ప్రతిష్ఠించిన శిల్పం దేవుడయి వరాలివ్వదా?

దేవాలయం క్షేమం కోరి ప్రజలు యిస్తున్న కానుకలు, ప్రజాక్షేమం కోరి దాతలు చేసిన త్యాగరూపమైన ధనధాన్యాదుల మీద పడింది ప్రభుత్వ దృష్టి?

ఉన్న మంచి మెకానిక్‌ని సరిగ్గా ఉపయోగించుకోవడం చేతగాక, రేడియో తీసుకెళ్ళి ఏ ఇత్తడి గిన్నెలు మాట్లేసేవాడికో యిస్తే ఏమవుతుంది? వాడు సుత్తి తీసుకుని ఒక్కటేస్తాడు. వంశపారంపర్యంగా వస్తున్న అర్చకులను, వాళ్ళ సదాచార సంప్రదాయాలను రద్దుచేస్తే దేవాలయాలే నాశనమవుతాయి. అప్పుడు దేవతా విగ్రహాలను హాయిగా మనమే ఇతర దేశాలకు అమ్ముకోవచ్చు. "స్మగ్లింగ్" బాధ లేకుండా, వివాహం మూలంగా కదా వ్యభిచారం నేరం! అసలు వివాహవ్యవస్థే రద్దు చేస్తే? వ్యభిచారం అనేదే ఉండదు. అహో అల్పతే రాజాణాం.

దేవాలయ వ్యవస్థ యొక్క స్వరూపజ్ఞానం లేని, కొందరు వేద మతవిరోధులు, కుహనా భక్తులు వాటి మూల సిద్ధాంతాల మీద నిర్ణయాలు తీసుకోవడం ఆరంభిస్తే భగవంతుడు ఇంకా ఉత్సవమూర్తి గా ఉంటాడా?

వేయిపడగల స్వామి విప్పారు కొనివచ్చి కాటందుకొనునులే ఇలలోని నియంతను